## క్లుప్తంగా

### సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న మల్లెంపల్లె రామచంద్రుడు

**డోన్ :** సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు వరం లాంటిదని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు అన్నారు. ఆర్థిక మంత్రి బుగ్గన స్వగృహంలో గురువారం కొచ్చెర్వు గ్రామానికి చెందిన చంద్రాదేవికి రూ1.65 లక్షలు, పాలికంటి మాదన్న కుటుంబానికి మంజూరైన రూ.14వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పేరన్న, మాదన్న, ఫిలిప్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### కొత్తకోట ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా చంద్రన్న యాదవ్

**డోన్ :** మండలంలోని కొత్తకోట గ్రామ ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా చంద్రన్న యాదవ్ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సర్పంచ్ సుదర్శనం రెడ్డి అనారోగ్యం కారణంగా దీర్ఘకాలిక సెలవులపై వెళ్లడంతో.. ఆయన స్థానంలో ఉపసర్పంచ్‌గా ఉన్న చంద్రన్న యాదవ్‌ను ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా నియమిస్తున్నట్లు ఈఓఆర్‌డీ జయరాముడు తెలిపారు. గురువారం జరిగిన ప్రమాణ స్వీకారానికి పంచాయతీ కార్యదర్శి మధుసూదన్‌తో పాటు కొత్తకోట, నక్కవాగులపల్లె గ్రామస్తులు హాజరై చంద్రన్నను సత్కరించారు.

### రాష్ట్రస్థాయి సైన్స్ ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

**బనగానపల్లె రూరల్:** మండలంలోని నందివర్గం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రాజెక్టు ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు స్కూల్ హెచ్‌ఎం వరప్రసాదరావు గురువారం తెలిపారు. ఫిబ్రవరి 26న నంద్యాల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయిలో జరిగిన సైన్స్ ప్రదర్శనలో తమ పాఠశాలకు చెందిన భరత్ కల్పన, మోక్షిత్ జాయ్ స్టిక్ వీల్ చైర్ ప్రాజెక్టును ప్రదర్శించి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఈ ప్రాజెక్టును ఈ నెల 6న విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో ఉత్తమ కేటగిరికీ ఎంపిక చేయడం జరిగిందన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు గోపాలకృష్ణ, సంజమ్మ అభినందించారు.

### జాతీయస్థాయి కరాటే పోటీల్లో..

**డోన్ రూరల్ :** పట్టణానికి చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి కరాటే పోటీలలో బంగారు పతకాలు సాధించనట్లు కరాటే మాస్టర్ రమణ తెలిపారు. గురువారం స్థానిక శ్రీసుధ పాఠశాలలో పతకాలు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 3న పల్నాడు జిల్లా, చిలకలూరిపేటలో 36వ జాతీయ స్థాయి కరాటే పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో కట, కుమిటి విభాగాల్లో ఆసిన్, భానుప్రకాశ్‌రెడ్డి, బాలాజీ సాకేత్ బంగారు, రజత, కాంస పతకాలు సాధించారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అహమ్మద్, పెదయద్య, రంజన్ తదితరులు పాల్గొన్నారు.

### శివుడికి అన్నాభిషేకం

**బేతంచెర్ల :** పట్టణంలోని పూదోట మఠంలో మహాశివ రాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం భక్తులు శివలింగానికి (భేతేశ్వర) సామూహిక అన్నాభిషేకం నిర్వహించారు. ఉదయం ఆశ్రమ కమిటీ సభ్యులు గుండా గోపాలు, సముద్రాల రామకృష్ణ ఆధ్వర్యంలో అర్చకులు ప్రభాకర శాస్త్రి, బాలజీ శర్మ శాస్త్రోక్తంగా మంత్రాలు చదవుతూ వినాయకుడికి అభిషేకం, భేతేశ్వర శివలింగానికి రుద్రాభిషేకం నిర్వహించిన అనంతరం సామూహిక అన్నాభిషేకం చేశారు.

### ఉత్తమ ఫలితాలు సాధించాలి

**సంజామల:** ప్రతి విద్యార్థి చదువుపై దృష్టి సారించి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని 1967 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సూచించారు. గురువారం పూర్వ విద్యార్థుల బృందం అకుమళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ ఏడాది పదో తరగతిలో పరీక్ష ఫలితాల్లో మొదటి, రెండవ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.10వేల చొప్పున ఇద్దరికి బహుమతి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సీపీ నాగిరెడ్డి, సి. నాగిరెడ్డి, వెంకటలక్ష్మమ్మ, మహబూబ్ సాహెబ్, తిరుపతిరెడ్డి, వెంగళ్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

### 25 అంశాలు ఏకగ్రీవ ఆమోదం



**డోన్ రూరల్:** స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశంలో 25 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. పట్టణంలో వివిధ ప్రాంతాలలో సీసీ కెమెరాల ఏర్పాటు, ఫాగింగ్ యంత్రాలు, తోపుడు బండ్ల కొనుగోలు, పాత పంప్ హౌస్‌కు సంబంధించిన బోర్లను పునరుద్ధరించుట తదితర వాటిని ఆమోదించారని చెప్పారు. సమావేశంలో వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్, జాకీర్‌హుసేన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ జయరాం పాల్గొన్నారు.

# అభివృద్ధి అంటే కోట్ల, కేఈలు కలవడమా ?

- మరి ఇన్ని దశాబ్దాలుగా ఎందుకు కలవలేదు?
- దశాబ్దాల క్రితమే కలిసుంటే 200 కుటుంబాలు రోడ్డున పడేవా?
- ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



నేరేడుచెర్ల కేడీసీసీ బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి

**ప్యాపిలి:** రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం కలిసిన కోట్ల, కేఈ కుటుంబాలు తమ కలయికే అభివృద్ధి అనే విధంగా మాట్లాడుతున్నారని ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మండల పరిధిలోని నేరేడుచెర్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన కేడీసీసీ బ్రాంచును రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములుతో కలసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ఉద్దేశించి మంత్రి మాట్లాడారు. డోన్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ తరుపున పోటీ చేసేందుకు సరైన నాయకుడే దొరకలేదని మంత్రి అన్నారు. ఒకటో కృష్ణుడు, రెండో కృష్ణుడు కాదని ఇప్పుడు మూడో కృష్ణుడిగా ప్రాయంలో ఉన్న వ్యక్తిని తెరపైకి తెచ్చారని ఎద్దేవా చేశారు. కొత్తగా వచ్చిన వ్యక్తి డోన్ నియోజకవర్గంలో అభివృద్ధి ఎక్కడ జరిగిందని అమాయకంగా ప్రశ్నిస్తున్నాడని విమర్శించారు. నియోజకవర్గంలో రోడ్లు వేయడం, ఆసుపత్రులు నిర్మించడం, చెరువులకు నీరు నింపడం, గోరుకల్లు ద్వారా వాటర్ గ్రిడ్ నిర్మించడం, కళాశాల భవనాలు నిర్మించడం అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు.

**రాజకీయ లబ్ధికోసం వర్గవిభేదాలు**

దశాబ్దాలుగా కోట్ల, కేఈ కుటుంబాలు గ్రామాల్లో వర్గవిభేదాలు సృష్టించి రాజకీయంగా లబ్ధి పొందారని మంత్రి ఆరోపించారు. ఇప్పుడు ఇద్దరూ ఒకే వేదికపైకి వచ్చి తాము కలసిపోయాము అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కలయిక మూడు దశాబ్దాల క్రితమే జరిగి ఉంటే దాదాపు 200 మంది ప్రాణాలు బలి అయ్యేవికాదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీ నాయకులు ఇంటింటికీ వచ్చి చంద్రబాబు చెప్పిన అబద్ధపు హామీలతో నమ్మించే ప్రయత్నం చేస్తారని..ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు.

**మారుమూల గ్రామాలకు సైతం బ్యాంకు సేవలు**

మారుమూల గ్రామాలకు సైతం బ్యాంకు సేవలు అందుబాటులోకి తెస్తున్నామని ఆర్థికశాఖ మంత్రి బుగ్గన అన్నారు. నేరేడుచెర్లతో పాటు మరో పది గ్రామాల ప్రజలకు కేడీసీసీ బ్రాంచు ద్వారా సేవలు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. గతంలో ఈ గ్రామాల ప్రజలు బ్యాంకు సేవల కోసం కనీసం 30 కిలోమీటర్లు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. గ్రామీణ ప్రజలకు బ్యాంకు సేవలు అందుబాటులోకి వస్తే ఆ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ అనిల్, సింగిల్ విండో అధ్యక్షుడు బోరెడ్డి రాము, బాలయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రెటరి శ్యాంసుందర్ రెడ్డి, కేడీసీసీ జిల్లా డైరెక్టర్ సీమ సుధాకర్ రెడ్డి, డీసీసీబీ కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ సీఈఓ విజయ్‌కుమార్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నగర పంచాయతీ వేలం పాటలు

**బేతంచెర్ల :** స్థానిక నగర పంచాయతీకి సంబంధించి ఏడాది కాలానికి సంత మార్కెట్, బండ్ల మెట్ట, కమేళా బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. సంత మార్కెట్‌ను నాగేశ్వర్‌రెడ్డి రూ.10,05,000, బండ్ల మెట్ట చంద్రశేఖర్ రెడ్డి రూ.13,77,000 , కమేళా మనోహర్ రూ.2,05,000కు దక్కించుకున్నారు. బహిరంగ వేలం పాటల ద్వారా నగర పంచాయతీకి రూ.25,87,000 ఆదాయం సమకూరిందని నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు వెల్లడించారు.

### అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

**కోవెలకుంట్ల:** గ్రామాల అభివృద్ధిలో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు భాగస్వాములు కావాలని ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేలా చొరవ చూపాలన్నారు. వివిధ శాఖల పరిధిలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ కొనసాగించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ షాజహాన్, ఎంపీడీఓ సయ్యదున్నీసా, సెబ్ సీఐ వర్ధనాదేవి, ఏపీఎం గురుస్వామి, డాక్టర్లు విద్యాసాగర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు సమాన హక్కులు



మాట్లాడుతున్న సివిల్ జడ్జి తంగమణి



బహుమతులు ప్రదానం చేస్తున్న కర్రా గిరిజ

**డోన్ రూరల్:** మహిళలకు సమాన హక్కులు ఉన్నాయని, అన్ని రంగాల్లో ధైర్యంగా ముందుకు సాగాలని డోన్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం సీడీపీఓ శంషాద్‌బేగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జడ్జి మాట్లాడుతూ ఆడపిల్లలకు ఉన్నత చదువులు చదివించి ఉన్నత స్థానాలలో ఉండేలా చూడాలన్నారు. చిన్న వయసులో పెళ్లిలు చేయడం నేరమని, బాల్యవివాహాలను పూర్తి అరికట్టాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి గైనకాలజిస్టు డాక్టర్ రమ్యశిల్ప, ఇన్నర్‌వీల్‌క్లబ్ మాజీ అధ్యక్షురాలు సుపత్రి, హెడ్ సిస్టర్ మంజుల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుగుణమ్మ, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

**బేతంచెర్ల:** పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, వార్డు కౌన్సిలర్ ఇబ్రహీం, మెప్మా కోఆర్డినేటర్ శ్రీదేవి, పొదుపు మహిళల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు.

**మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి**

**కోవెలకుంట్ల:** పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులకు వివిధ పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు.

**బనగానపల్లె రూరల్ :** మండలంలోని యాగంటిపల్లె గ్రామ సమీపంలో ఉన్న కేవీకేలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కేవీకే ప్రధాన అధికారి ధనలక్ష్మి, మహిళా శాస్త్రవేత్త లక్ష్మీప్రియ, ఏసీడీపీఓ రోజారాణిలను అంగన్‌వాడీ వర్కర్లు సన్మానించారు.

### రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎర్రబోతుల ఉదయ్‌భాస్కర్‌రెడ్డి

**కొలిమిగుండ్ల:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పెట్నికోట- నాయినపల్లె గ్రామాల మధ్య వెలసిన గుండుమల్లేశ్వరస్వామి ఆలయ ఆవరణలో రాష్ట్ర స్థాయి కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీలను గురువారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎర్రబోతుల ఉదయ్‌భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. రాయలసీమ జిల్లాలతో పాటు బాపట్ల తదితర జిల్లాల నుంచి క్రీడా కారులు పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుధాకర్ గుప్త, తెలుగు పండిట్ వైవీఎస్ నారాయణరెడ్డి, పీడీలు భాస్కర్‌రెడ్డి, భుజంగరావు, వెంకటేశ్వర్లు, హరికృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు సోమశేఖర్‌రెడ్డి, కొండారెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**9 నుంచి రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు**

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పెట్నికోటలోని గుండుమల్లేశ్వరస్వామి ఆలయ క్రీడా మైదానంలో ఈనెల 9నుంచి రెండు రోజుల పాటు రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎర్రబోతుల ఉదయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు.

### బాధిత రైతులను ఆదుకుంటాం



బాధితులకు ఆర్థికసాయం అందజేస్తున్న కాటసాని ఓబుళరెడ్డి

**కోవెలకుంట్ల:** స్థానిక సంతపేటలో ఇటీవల గడ్డివాములు దగ్ధమై నష్టపోయిన పాడి రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే తనయుడు కాటసాని ఓబుళరెడ్డి అన్నారు. సంతపేటకు చెందిన తలారి మధు, ఈశ్వరయ్య, శివయ్య, నాగరాజు, తదితర పాడి రైతులకు సంబంధించిన గడ్డివాములు మూడు రోజుల క్రితం ప్రమాదశాత్తు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న కాటసాని ఓబుళరెడ్డి గురువారం రాత్రి బాధిత రైతులను కలిసి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. పశుగ్రాసం కొనుగోలుకు తమ వంతుగా రూ.లక్ష ఆర్థిక సాయమందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, న్యాయ విభాగ జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

### ప్రజల చెంతకే సుపరిపాలన



బుడగ జంగాల కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

**డోన్ :** మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాలలో సచివాలయాల ద్వారా ప్రజల చెంతకే సుపరిపాలన అందించే ఏర్పాటు చేశారని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు అన్నారు. మండలంలోని దొరపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, హెల్త్ సెంటర్, బుడగజంగాల కమ్యూనిటీ హాల్‌లను ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్ ప్రారంభించారు. పార్టీ మండల అధ్యక్షుడు దొరపల్లె చిరంజీవి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, పంచాయతీ రాజ్ ఏఈ నారాయణ, సర్పంచ్ గంగాదేవి, మండల ఉపాధ్యక్షురాలు సుభద్ర, ఉపసర్పంచ్ సిద్దయ్య, నాయకులు పాల్గొన్నారు.

**పైపులైన్‌కు మరమ్మతులు**

**కొలిమిగుండ్ల:** మండల కేంద్రం కొలిమిగుండ్లలో పైపులైన్ పాడైపోయి లేకపోవడంతో నాలుగు రోజులుగా మంచినీటి సరఫరాలో జాప్యం చోటు చేసుకుంది. సర్పంచ్ శివరాముడు ఆధ్వర్యంలో గురువారం పైపులైన్‌కు మరమ్మతు పనులు చేపట్టారు. బ్రిడ్జి సమీపంలో పాడైపోయిన పైపులను తొలగించి కొత్తగా 30 పైపులు ఏర్పాటు చేసి యథావిధిగా ఆయా కాలనీలకు సరఫరా అందించారు.

**ఆయిల్ పామ్ సాగుపై అవగాహన**

**సంజామల:** మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ వారు రైతులకు, వ్యవసాయ సిబ్బందికి గురువారం ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ జిల్లా మేనేజర్ మహదేవయ్య, ఫీల్డ్ ఆఫీసర్ సూర్యతేజ పాల్గొన్నారు.

**సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యం**

**బేతంచెర్ల :** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రవి ప్రసాద్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు.

**కేంద్ర బలగాల కవాతు**

**బనగానపల్లె రూరల్ :** సార్వత్రికలను దృష్టిలో ఉంచుకొని సీఐ గంటా సుబ్బారావు ఆధ్వర్యంలో గురువారం సాయత్రం బనగానపల్లె పట్టణంలోని ప్రధాన రోడ్ల వెంట సెంట్రల్ ఆర్మ్‌ఫోర్స్(కేంద్ర) బలగాలు కవాతు నిర్వహించాయి. అసిస్టెంట్ కమాండెంట్ విక్రమ్‌కుమార్,ఎస్ఐలు ప్రదీప్‌కుమార్, రామిరెడ్డి పాల్గొన్నారు.

**విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ**

**బనగానపల్లె రూరల్:** మండలంలోని ఇల్లూరు కొత్తపేట గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు వైపీ మల్లారెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించే విద్యార్థులకు రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేల ప్రకారం ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామన్నారు.

# జగన్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి
- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలసి గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభం




కోనాపురంలో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

**అవుకు:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి గ్రామీణ ప్రజల సంక్షేమంపై, గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించారని, జగనన్న పాలనలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమైందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో రూ.2.24 కోట్లతో పూర్తిచేసిన పలు అభివృద్ధి పనులను జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, బనగానపల్లె నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు కాటసాని తిరుపాల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందు సుదీర్ఘ పాదయాత్ర చేసి, గ్రామీణ ప్రజల కష్టాలను, గ్రామాల్లో నెలకొన్న దుస్థితులను కళ్లారా చూశారన్నారు. గ్రామాల అభివృద్ధికి , ప్రజల సంక్షేమానికి ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు చేపట్టడానికి అదే కారణమని అన్నారు.

**కోనాపురంలో అభివృద్ధి పనుల ప్రారంభం**

తమ సొంత గ్రామాల్లో ఒకటైన కోనాపురం గ్రామ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని అన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ తమకు బంధువులేనని, వారికి అన్ని విధాల అండగా ఉండటం నా కర్తవ్యమన్నారు. కోనాపురంలో రూ.67లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైన్, కవర్స్ స్లాబ్స్‌ను, రూ.12లక్షలతో నిర్మించిన ఎంపీపీఎస్ పాఠశాలను, రూ.20లక్షలతో కోనాపురం నుంచి మెట్టుపల్లె పెద్దమ్మ వరకు, రూ.19 లక్షలతో కోనాపురం గంగమ్మ ఆలయం నుంచి కదిరయ్య ఆలయం వరకు, రూ.18లక్షలతో ఎస్సార్బీసీ కాలువ నుంచి కాటసాని భాస్కర్ రెడ్డి పొలం వరకు వేసిన గ్రావెల్ రోడ్లను ప్రారంభించారు. అలాగే మెట్టుపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని లింగంబోడు గ్రామంలో రూ.5లక్షలతో నిర్మించిన శుద్ధజల కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్,పీఆర్ ఈఈలు క్రిష్ణారెడ్డి, రమణ, ఉమ్మడి కర్నూలు జిల్లాల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డి, యాగంటి బ్రహ్మానంద రెడ్డి, నాయకులు వంగల సాంబశివారెడ్డి, ఉమ్మడి క్రిష్ణారెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మంగంపేట అన్ని రకాలుగా అభివృద్ధి**

మండల పరిధిలోని మంగంపేట అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. గ్రామంలో రూ.83.14లక్షలతో జరిగిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరయ్యారు. ముందుగా గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు కేరళ భజంత్రీలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం రూ.23.94లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని, రూ.38.4లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని, రూ.20.8లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్‌ను అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మంగంపేట, మంగంపేట తండా గ్రామాల్లో ఇప్పటి వరకు రూ.3.75 కోట్ల నిధులతో దాదాపు అన్ని మౌలిక వసతులను కల్పించామన్నారు. ఎన్నో ఏళ్లుగా మంగంపేట, మంగంపేట తాండా, కాశిరెడ్డినాయన ఆశ్రమ భక్తులు ఎదురుస్తున్న రోడ్డు పనులను కూడా ప్రారంభించామని తెలిపారు. అనంతరం 39 మందికి ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్, ఏఓ వెంకటేశ్వర్లు, సర్పంచ్ లక్ష్మి తొలిసమ్మ, నాయకులు మల్లేశ్వరుడు, చిన్న పుల్లయ్య, పాపారాయుడు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

### సొంతింటి కల సాకారమే ధ్యేయం



రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే

**బనగానపల్లె :** పేదవాని సొంతింటి కల సాకారం చేయాలన్నదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పొదుపు భవనంలో గురువారం మండలంలోని 731 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలను తహసీల్దార్ రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ ప్రభుత్వంలో సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. ఇళ్లులేని అర్హులైన పేదలకు ఇంటి స్థలాల పంపిణీ, ఇంటి నిర్మాణం చేయడమే సీఎం వైఎస్ జగన్ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బండి బ్రహ్మానందరెడ్డి, యాగంటి ఆలయ చైర్మన్ తోటబుచ్చిరెడ్డి, నాయకులు సుబ్బారెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

**రోడ్డు నిర్మాణానికి భూమిపూజ**

బనగానపల్లె మండలం క్రిష్టగిరిమెట్ట నుంచి కాశీరెడ్డినాయన ఆశ్రమం మీదుగా అలేబాద్‌తండా వరకు రూ.21.50 కోట్లతో నూతనంగా బీటీ రోడ్డు నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆర్ అండ్‌బీ ఎస్ఈ శ్రీధర్‌రెడ్డి, కాశీరెడ్డినాయన ఆశ్రమం వ్యవస్థపకులు గణపతినాయన స్వామి, నాయకులు కాటసాని ప్రసాదరెడ్డి కాటసాని తిరుపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా 18 కిలో మీటర్ల మేర బీటీ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ అండ్‌బీ డీఈఈ సునీల్‌కుమార్‌రెడ్డి, ఏఈ హుస్సేన్, ఎంపీపీ మానసవీణ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ జనార్దన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వర్‌నాయక్, పాపన్న వెంకటేశ్వరరెడ్డి, జగదీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



దేవరబండలో పత్రాలు అందిస్తున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు

**డోన్ రూరల్ :** మండల పరిధిలోని దేవరబండ గ్రామంలో జగనన్న కాలనీలోని ఇంటి స్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను గురువారం గ్రామ సర్పంచ్ పద్మావతి, ఎంపీటీసీ మహేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు మధుసుదన్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. ఇళ్లు లేని ప్రతి పేదవాడికి ఇళ్లు నిర్మించుకోవాలనే కలను నెరవేర్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

**డోన్ రూరల్ :** జగనన్న కాలనీలోని ఇంటి స్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను గురువారం పట్టణంలోని స్థానిక 13వ వార్డులో కౌన్సిలర్ దినేష్‌గౌడ్ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఆయన మాట్లాడుతూ 13వ వార్డులో 126మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేసినట్లు తెలిపారు.

### యాగంటిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ధ్వజారోహణం పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**బనగానపల్లె రూరల్ :** మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణ కార్యక్రమంతో గురువారం ప్రారంభమయ్యాయి. ఆలయ ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డిల ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో ఏకశిలారూపంలో కొలువైన శ్రీశివపార్వతులకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకము, కుంకుమార్చన, సహస్రనామావళి అనంతరం 8 గంటలకు ధ్వజారోహణ పూజలు ఘనంగా నిర్వహించారు.

**మహా శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన**

**డోన్ :** మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని శివాలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ , కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. గురువారం స్థానిక కొత్త, పాతబుగ్గ రామలింగేశ్వర స్వామి ఆవరణలో పరిసరాలను పరిశుభ్రం చేసే పనులను పరిశీలించారు. డీఈ రసూల్, ఏఈ సతీష్‌లతో పాటు మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ఎన్నికలకు సమాయత్తం కావాలి**



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

**డోన్ :** అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రభుత్వ పథకాలను ప్రజలకు విపులంగా వివరించాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు పోస్టుప్రసాద్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని 22వ వార్డులో నేను సిద్ధం .. నా బూత్ సిద్ధం కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలను కార్యోన్ముఖులను చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు బోయ సుమలత, శరత్‌బాబు పాల్గొన్నారు.